నాడు : సీఎం వైఎస్ జగన్ సంకల్పం

పేద ప్రజలందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని... అందుకోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరితపించారు. ఆరోగ్యశ్రీతో కోట్ల మంది గుండెల్లో సజీవంగా నిలిచిన తన తండ్రి, దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి బాటలోనే తన ఐదేళ్ల పదవీ కాలంలో ఎన్నో ఆస్పత్రుల అభివృద్ధికి, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు జగన్ అధిక ప్రాధాన్యమిచ్చారు. అందులో భాగంగా అనారోగ్యంతో విమ్స్‌కు వచ్చే పేద రోగులకు అవసరమైన అన్ని పరీక్షలూ ఉచితంగా చేయాలనే లక్ష్యంతో ఆధునిక సిటీ డయాగ్నస్టిక్ సెంటర్ నిర్మాణానికి సంకల్పించారు. అనుకున్నదే తడవుగా తన పాలనా కాలంలోనే రూ.20 కోట్లు కేటాయించి పనులు ప్రారంభింపజేశారు. కాలక్రమంలో ఆ పనులు ఆరు నెలల కిందట పూర్తయ్యాయి.

నేడు : ప్రైవేట్ వ్యాపారుల దురాలోచన

విమ్స్ ఆవరణలో నిర్మించిన సిటీ డయాగ్నస్టిక్ సెంటర్ సేవలు అందుబాటులోకి వస్తే తమ వ్యాపారాలు దెబ్బ తింటాయని ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంటర్ల నిర్వాహకులు కుయుక్తులు పన్నుతున్నారు. అందులో భాగంగానే ఇక్కడి కేంద్రం అందుబాటులోకి రాకుండా అడ్డుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కేంద్రం అందుబాటులోకి వచ్చి ఉచిత వైద్య పరీక్షలు చేస్తే... వారి వ్యాపారాలకు నష్టమని భావించి విమ్స్ అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అందువల్లే ఇక్కడి కేంద్రం నిర్మాణం పూర్తయి ఆరు నెలలు గడుస్తున్నా ప్రారంభించకుండా వదిలేశారని విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ఈ కేంద్రం అందుబాటులోకి వచ్చి పేదలందరికీ ఉచితంగా వైద్య పరీక్షలన్నీ చేస్తే... విమ్స్‌కు ఓపీ కూడా పెరుగుతుంది. అలా చేయకుండా నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహోన్నత ఆశయానికి స్వార్థంతో కొందరు తూట్లు పొడుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



విమ్స్ ఆవరణలో రూ.20 కోట్లు ఖర్చు చేసి నిర్మించిన సిటీ డయాగ్నస్టిక్ సెంటర్ భవనం

మహోన్నత ఆశయానికి స్వార్థంతో తూట్లు

పేద రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేయించాలని భావించిన నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- విమ్స్ ప్రాంగణంలో రూ.20 కోట్లతో సిటీ డయాగ్నస్టిక్ సెంటర్ నిర్మాణానికి వైఎస్సార్ సీపీ పాలనలో శ్రీకారం
- భవన నిర్మాణం ఆరు నెలల క్రితమే పూర్తయినా సేవలు ప్రారంభించని విమ్స్ అధికారులు
- ప్రైవేట్, కార్పొరేట్ డయాగ్నస్టిక్ సెంటర్ల ఒత్తిడితో కేంద్రాన్ని ప్రారంభించడం లేదనే ఆరోపణలు



భవనం లోపల రక్త పరీక్షలు జరిపే హాల్



అస్తవ్యస్తంగా భవనం లోపలి భాగం

ఆరిలోవ : విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్) ఆవరణలో సిటీ డయాగ్నస్టిక్ సెంటర్ భవనం సిద్ధమైనా ప్రారంభం కాకుండా నిరుపయోగంగా నిలిచింది. అధికారులు దీన్ని అందుబాటులోకి తీసుకురాకపోవడంతో పేద రోగులకు ఉచిత వైద్య పరీక్షలు అందడం లేదు. ఎంతో విలువైన స్థలంలో రూ.20 కోట్లు ఖర్చు చేసి నిర్మించినప్పటికీ అదృశ్య శక్తుల ఒత్తిడి మేరకు దీన్ని ప్రస్తుతం నిరుపయోగంగా వదిలేశారు. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే పేద రోగులకు ఉచిత సేవలు అందడంతోపాటు విమ్స్‌లో ఓపీ, ఇన్‌పేషెంట్లు గణనీయంగా పెరిగే అవకాశం కూడా ఉందని వైద్యులు అంటున్నారు. అయినా సంబంధిత అధికారులు ఈ కేంద్రాన్ని ప్రారంభించకుండా వదిలేశారు.

పేద రోగులకు ఉచిత వైద్య పరీక్షలే లక్ష్యంగా..

పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు చేయాలనే లక్ష్యంతో 2021లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సిటీ డయాగ్నస్టిక్ సెంటర్ ఏర్పాటు చేయించాలనే ఆలోచన చేశారు. దీంతో విమ్స్ ఆవరణలో బీఆర్‌టీఎస్ రోడ్డు వైపు ద్వారం సమీపంలో సుమారు అర ఎకరం స్థలాన్ని కేటాయించారు. రూ.20 కోట్ల నిధులు కేటాయించారు. అదే ఏడాది సెప్టెంబర్‌లో నిర్మాణ పనులు ప్రారంభించారు. ఒకటిన్నర సంవత్సరాల్లో నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అప్పట్లో అధికారులు ప్రాణాళిక సిద్ధం చేశారు. అప్పటి నుంచి కొన్నాళ్లపాటు పనులు చకచకా జరిపించారు. అనంతరం మధ్యలో కొంతకాలం పనులు నిలిచిపోయాయి. 2023 నుంచి మళ్లీ పనులు ప్రారంభించి శరవేగంతో కొనసాగించారు. 2024 మార్చి నుంచి సాధారణ ఎన్నికల హడావిడితో అధికారులు నిర్మాణ పనులను పక్కనపెట్టేశారు. అప్పటికే భవన నిర్మాణం పూర్తయింది. అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ కేంద్రానికి గ్రహణం పట్టించారు. ఎట్టకేలకు లోపల ఫ్లోరింగ్, విద్యుత్ వైరింగ్ పనులు, ల్యాబ్‌కు అవసరమైన పరికరాల ఏర్పాటు, సీలింగ్ తదితర పనులు జరిపించారు. ఇందులో పెథాలజీ ల్యాబ్, మీటింగ్ హాల్, సిటో పెథాలజీ ల్యాబ్, క్లినికల్ పెథాలజీ, స్పెషలిస్టు పెథాలజీ రూం, పారా మెడికల్ ల్యాబ్, జనరల్ మెమటాలజీ ల్యాబ్, తదితర ల్యాబ్‌లన్నీ సిద్ధమయ్యాయి. ఇవన్నీ సిద్ధమై సుమారు ఆరు నెలలైంది. అన్ని సదుపాయాలతో ప్రారంభానికి సిద్ధమైనా ఇంతవరకు అధికారులు అందుబాటలోకి తీసుకురాకుండా వదిలేశారు.

కేంద్రం ప్రారంభిస్తే అందించే సేవలివీ...

విమ్స్‌లో నిర్మించిన సిటీ డయాగ్నస్టిక్ **కేంద్రం ప్రారంభమైతే** నగరంలో పేద, మధ్య **తరగతి ప్రజలకు ఉచిత** వైద్య పరీక్షలు అందు**బాటులోకి వస్తాయి.** నగరంలో ఎక్కడి రోగులకైనా **ఉచితంగా రక్త పరీక్షలు** చేసి స్కానింగ్ తీయనున్నారు. **ప్రస్తుతం** చిన్నపాటి జ్వరానికీ **వైద్యులు వివిధ రక్త రీక్షలు**, స్కానింగ్‌లు చేయించాలని **రిఫర్ చేస్తున్నారు.** ఆయా పరీక్షలు చేయ**డానికి రోగులకు** ప్రైవేటు కేంద్రాలను ఆశ్ర**యిస్తే రూ.వేలల్లో** ఖర్చు అవుతోంది. **విమ్స్‌లోని సెంటర్ వినియోగంలోకి వస్తే పేద, మధ్య తరగతి ప్రజలకు** ఉచితంగా అన్ని రకాల **రక్త పరీక్షలతోపాటు** సిటీ స్కానింగ్, ఎక్స్‌రే, **అల్ట్రాసౌండ్ తదితర** వైద్య పరీక్షలన్నీ అందుబా**టులోకి రానున్నాయి.** దీనికోసం పేద, మధ్య **తరగతి రోగులు ఎదురు** చూస్తున్నారు.



గదులలో అమర్చిన ఏసీలు, ఫ్యాన్లు



వినియోగించకపోవడంతో భవనం ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలు

క్లుప్తంగా

వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని ధర్నా



మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న బాధితులు

మధురవాడ: జీవీఎంసీ ప్రజారోగ్యం విభాగంలో వివిధ కారణాలతో ఉద్యోగాలు కోల్పోయిన, మరణించిన కార్మికుల వారసులకు ఆప్కాస్ ద్వారా ఉద్యోగాలు ఇవ్వాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో బాధితులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు డి. అప్పలరాజు, నరేంద్ర కుమార్ మాట్లాడుతూ, 60 ఏళ్లు నిండిన కార్మికుల వారసులకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదని ఆరోపించారు. దీర్ఘకాలిక సెలవుల్లో ఉన్న కార్మికులను కూడా తిరిగి విధుల్లోకి తీసుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం అధికారులు వినతిపత్రం సమర్పించారు.

వీధి వ్యాపారుల ఉపాధికి భద్రత కల్పిస్తాం



వీధి విక్రయదారుల సంఘం సమావేశంలో మాట్లాడుతున్న జెడ్సీ కనక మహాలక్ష్మి

మధురవాడ: వీధి వ్యాపారుల ఉపాధికి ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ జోన్-2 కమిషనర్ కొట్యాడ కనక మహాలక్ష్మి తెలిపారు. సోమవారం జోనల్ కార్యాలయంలో జరిగిన పట్టణ వీధి విక్రయదారుల సంఘం సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు పి. రాజ్‌కుమార్, టి. ప్రదీప్ కుమార్, ఆదినారాయణ మాట్లాడుతూ గతంలో వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు, ఉపాధి భద్రత కల్పిస్తామని అధికారులు చెప్పారని, ఇప్పుడు ఉపాధిని దెబ్బతీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జెడ్సీ కనక మహాలక్ష్మి, ఏసీపీ శబ్నాన్ శాస్త్రి స్పందిస్తూ.. హాకర్స్ జోన్‌లు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అయితే రోడ్లకు అడ్డంగా, ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసి ట్రాఫిక్‌కు, ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగించవద్దని వారు కోరారు.

నేటి నుంచి కేరళ ఆయుర్వేద శిబిరం

డాబాగార్డెన్స్ : ఆయుర్వేద పంచకర్మ విధానం ద్వారా దీర్ఘకాల రోగాలకు చికిత్స అందించేందుకు ఈ నెల 23, 24న కేరళ మెగా ఆయుర్వేద శిబిరం నిర్వహించనున్నట్టు ఔషధాలయ మేనేజర్ దినుప్ తెలిపారు. జీవీఎంసీ ప్రధాన గేట్ ఎదురుగా రాంనగర్ వైద్యరాజ్ ఔషధాలయంలో ప్రముఖ కేరళ వైద్యుడు డాక్టర్ కేఎం ఉన్నికృష్ణన్ నాయర్ 2 రోజులపాటు అందుబాటులో ఉంటారని తెలిపారు. డాక్టర్‌ను సంప్రదించాలనుకునే వారు అపాయింట్‌మెంట్ కోసం 8008000670, 9133106060లో సంప్రదించాలని సూచించారు.

దివ్యాంగుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభిస్తున్న ఏయూ రెక్టార్ ఆచార్య కిషోర్‌బాబు

మద్దిలపాలెం : సమ్మిళితం చేస్తూ దివ్యాంగ చిన్నారులను సాధికారత దిశగా నడిపించాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు అన్నారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలోని గౌతమ్ బుద్ధ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆడిటోరియంలో సోమవారం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ ది పర్సన్స్ విత్ ఇంటలెక్చువల్ డిజైబిలిటీస్, విద్యా విభాగం సంయుక్తంగా పర్పుల్ ఫెయిర్ కార్యక్రమం నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆచార్య కిషోర్ బాబు మాట్లాడుతూ దివ్యాంగుల్లో ఉన్న ప్రత్యేక నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. దివ్యాంగుల్లోని నైపుణ్యాలు, సృజనాత్మకత ప్రదర్శించే వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడంపై సంతోషం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ డైరెక్టర్ వినీత సింఘాల్ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం – 2020లో భాగంగా విద్యలో అందరినీ భాగం చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్న శుభ సమయంలో ఇటువంటి కార్యక్రమానికి ఏయూ తోడ్పాటు అందించడం సంతోషకరమన్నారు. విద్యావిభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు మాట్లాడుతూ తమ సామర్థ్యం, నైపుణ్యాలు ప్రదర్శించడానికి దివ్యాంగులకు ఈ వేదిక ఎంతో ఉపయోగకరంగా నిలిచిందన్నారు. భవిష్యత్‌లో దివ్యాంగుల జీవితాలు ప్రకాశవంతంగా ఉండాలన్నారు. అనంతరం ఎన్‌ఐఈపీఐడీ డైరెక్టర్ డాక్టర్ బి.వి.రామ్ కుమార్, సర్వశిక్ష అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ డాక్టర్ జె.చంద్రశేఖరరావు ప్రసంగించారు. కార్యక్రమంలో భాగంగా దివ్యాంగ చిన్నారులు తయారు చేసిన వస్తువులతో ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. అనంతరం వారు ప్రదర్శించిన దశావతార నృత్యరూపకం ఆకట్టుకుంది.

వైద్య పరీక్షలు నిర్వహించాలి

మహారాణిపేట: ప్రతి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ)లో అక్టోబర్ 2 వరకు వైద్య శిబిరాలు నిర్వహించి, రోగులకు అన్ని వైద్య పరీక్షలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. క్రాంతినగర్, సిద్ధేశ్వరం, పురుషోత్తపురం ఆరోగ్య కేంద్రాలను సోమవారం ఆయన సందర్శించి వైద్య సిబ్బందికి పలు సూచనలిచ్చారు. క్యాన్సర్, ఇతర ఆరోగ్య పరీక్షలు చేయడంలో ఎవరూ నిర్లక్ష్యం చూపవద్దని, పరీక్షలు చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాతా, శిశు సేవలను కూడా అందించాలన్నారు. వైద్య శిబిరాల్లో అభ ఐడీ గుర్తించాలని, గర్భిణుల పేర్లు నమోదు చేయాలని, సమయపాలన పాటించాలని సిబ్బందికి సూచించారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తాం

బీచ్‌రోడ్డు : జేఈఈ, నీట్ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా నగరంలో సమాచార కేంద్రం ప్రారంభించామని ఫిజిక్స్ వాలా సీఈవో అంకితా గుప్తా తెలిపారు. ఈ మేరకు నగరంలోని ఒక హోటల్‌లో మీడియా సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలోని విద్యార్థులకు ఈ కేంద్రం అనుకూలంగా ఉంటుందన్నారు. ప్రధానంగా పెదవాల్తేరు, మద్దిలపాలెం, రామాటాకీస్, గురుద్వార్, రైల్వేస్టేషన్, అల్లిపురం, మద్రిపాలెం, ఎన్ఏడీ తదితర ప్రాంతాల విద్యార్థులు కేంద్రాన్ని వినియోగించుకోవచ్చన్నారు. విద్యార్థులకు సుదూర ప్రయాణాన్ని తగ్గించడం మా ఉద్దేశమన్నారు. పోటీ పరీక్షలకు సంబంధించి సమస్త సమాచారాన్ని పొందవచ్చని తెలిపారు.

బాలల గృహాల తనిఖీ కమిటీ సభ్యుడిగా నరవ ప్రకాశరావు

అల్లిపురం: బాలల రక్షణ, సంరక్షణకు సంబంధించిన బాలల గృహాల తనిఖీ కమిటీ మెంబర్‌గా నరవ ప్రకాశరావును నియమిస్తూ జిల్లా కలెక్టరేట్ ఉత్తర్వులు జారీ చేసింది. జువైనల్ జస్టిస్ చట్టం ప్రకారం విశాఖ జిల్లాలోని ప్రభుత్వ, గుర్తింపు పొందిన బాల గృహాల పనితీరుపై తనిఖీ కమిటీకి జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. మూడేళ్ల కాలపరిమితి గల ఈ కమిటీ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు బాలల గృహాలు చట్ట ప్రకారం నిబంధనలు పాటిస్తున్నాయా.. లేదా తనిఖీ చేసి నివేదికలు క్రమం తప్పకుండా ప్రభుత్వానికి అందజేస్తుంది. ఈ నెల 25న జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన కమిటీ సమావేశం జరగనుంది.

భిన్నత్వంలో ఏకత్వంతో సమగ్రత సాధ్యం



రోటరీ క్లబ్ వాల్తేరు జిల్లా సభ్యులు

మద్దిలపాలెం : భిన్నత్వంలో ఏకత్వంతో సమగ్రత సాధించవచ్చని రోటరీ క్లబ్ సభ్యులు అన్నారు. సమష్టి కృషితోనే లక్ష్యాలు సాకారమవుతాయన్నారు. రోటరీ జిల్లా 3020లో భిన్నత్వం, సమతుల్యత, అంతర్భాగం చేయుట (డీఈఐ) అనే అంశాలపై మద్దిలపాలెం సమీపంలోని కాకతీయ ఫంక్షన్ హాలులో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ వాల్తేర్ అధ్యక్షుడు ఎ.ఎస్.టి.భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వక్తలు ప్రసంగించారు. సర్వమత ప్రార్థనలతో ప్రారంభించి, నర్తనశాల నాట్యశాల విద్యార్థులు భారతదేశంలోని 9 రకాల నృత్యాలతో ఆహుతులను అలరించారు. రోటరాక్టర్స్ విద్యార్థులు వివిధ వృత్తులు ప్రదర్శించారు. కార్యక్రమంలో డీఈఐ జిల్లా చైర్మన్ సత్యశ్రీ దెందుకూరి, సుహాసిని, కో చైర్మన్ నందిని, పూర్వ గవర్నర్ ఛాయాదేవి, రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ కల్యాణ్ చక్రవర్తి, వైస్ ప్రెసిడెంట్ అజయ్ కుమార్, అశోక్ గోటి రోలాండ్ విలియమ్స్, సెక్రటరీ సారిక రాయ్, పూర్వ అధ్యక్షులు ఎస్.ఎం.స్వామి, కాబోయే రోటరీ జిల్లా గవర్నర్ శ్రీరామ్, శోభన్ ప్రకాశ్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ మోసాలపై కరపత్రాల పంపిణీ



18వ వార్డులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు కల్యాణ్, తదితరులు

ఎంవీపీ కాలనీ : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం చేసిన మోసాలపై ప్రజలు నిలదీయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు సూచించారు. ఈ మేరకు బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం జీవీఎంసీ 18వ వార్డులో సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పార్టీ వార్డు అధ్యక్షుడు ఉమ్మిడి కల్యాణ్ మాట్లాడుతూ అబద్ధపు హామీలతో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి నాయకులు 2024 ఎన్నికల్లో ఓటర్లను మోసం చేసి అడ్డదారిలో గద్దెనెక్కారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాదిన్నర పాలనలో ఆ హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. ఒక్క హామీని కూడా పూర్తి స్థాయిలో అమలు చేయకుండా పేద, సామాన్యుల నడ్డి విరిచారన్నారు. కూటమి ప్రభుత్వ మోసాలపై ఆ పార్టీ నాయకులను నిలదీయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు పేర్ల విజయచందర్, వార్డు మహిళ విభాగం అధ్యక్షురాలు గరికిన ధనలక్ష్మి, ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షుడు మారుపల్లి పరదేశి, తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవీ నమోస్తుతే..

- వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం
- నియోజకవర్గంలోని వాడవాడలా మండపాల్లో కొలువుదీరిన దుర్గామాత



అద్భుత అలంకరణలో దుర్గాదేవి అమ్మవారు

మద్దిలపాలెం : దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయాలన్నీ విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో విశాఖ తూర్పు నియోజకవర్గం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఆలయాల్లో దుర్గమ్మకు ప్రత్యేక అభిషేకాలు చేసి సుందరంగా అలంకరించారు. మండపాల వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. జీవీఎంసీ 16వ వార్డు పాత వెంకోజీపాలెంలో రాధాకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాలను వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు సోమవారం ప్రారంభించి తొలి పూజ చేశారు. అమ్మవారి కరుణా కటాక్షాలు ప్రజలందరిపైనా ఉండాలని ఆకాంక్షించారు. ఉత్సవ నిర్వాహకులు ముత్యాల రాజు, పల్లా శ్రీనివాస్, పల్లా చిన్నారావు, పల్లా అప్పలరాజు, నమ్మి చిన్న, పెంటారావు, ఒమ్మి రవి, పల్లా శివ, ఒమ్మి కోటి, పల్లా ప్రసన్న, పల్లా గోపి, ప్రసాద్, ఉమా, వంశీ, స్థానిక యువకులను ఆయన అభినందించారు. వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు చొల్లంగి నాగేశ్వరరావు, మీసాల ప్రదీప్ పాల్గొన్నారు.



చినవాల్తేరులోని ఆలయంలో అమ్మవారికి కుంకుమార్చన చేస్తున్న భక్తులు



ఏపీఎస్ఈబీ కాలనీలో కొలువుదీరిన దుర్గాదేవి

- ఏపీఎస్ఈబీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు బాలాత్రిపుర సుందరి దేవి అవతారంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. వేడుకల్లో భాగంగా సాయంత్రం నాట్యకళారాశి వారి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఎం.సింహాద్రిరాజు, చైర్మన్ కొండ్రు రామారావు పాల్గొన్నారు.
- జీవీఎంసీ 15, 16వ వార్డుల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 16వ వార్డు సంజయ్ గాంధీ కాలనీలోని కనకదుర్గా ఆలయంలో మహిళలు తెల్లవారుజామున అమ్మవారికి పంచామృతాభిషేకాలు, నీలాభిషేకాలు చేశారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. అర్చకులు వెంకటరావు శర్మ అభిషేకాలు చేశారు. ఉత్సవాలకు మండపం ఏర్పాటు చేసి, దుర్గాదేవికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నారాయణ, మురళి, సూర్యనారాయణ, మళ్ల దుర్గ పాల్గొన్నారు.



దుర్గాదేవిని దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మొల్లి అప్పారావు, నాయకులు

- జాతీయ రహదారి పక్కన కొత్త వెంకోజీపాలెం ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా శ్రీవీరాంజనేయ ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపారు.

బీచ్‌రోడ్డు : చినవాల్తేరు గ్రామ దేవత శ్రీకనక మహాలక్ష్మి అమ్మవారు శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం బాల త్రిపుర సుందరి దేవి అవతారంలో భక్తులకు దర్శనిమిచ్చారు. మహోత్సవాల్లో భాగంగా సాయంత్రం అమ్మవారికి భక్తులు కుంకుమార్చన చేశారు.

- హనుమంతవాకలోని విజయదుర్గా కాలనీలో శ్రీవిజయ గణపతి సమేత విజయదుర్గాదేవి ఆలయంలో నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ మహోత్సవాల్లో భాగంగా సోమవారం బాల త్రిపుర సుందరి దేవి అవాతరంలో భక్తులకు అమ్మవారు దర్శనిమిచ్చారు.



విజయదుర్గా కాలనీలో బాలాత్రిపుర సుందరిదేవి అవతారంలో అమ్మవారు

జీఎస్టీ ఉపసంహరణతో ప్రజలకు ఉపశమనం

డాబాగార్డెన్స్: ఆరోగ్య, జీవిత భీమా ప్రీమియంలపై జీఎస్టీ ఉపసంహరణ ప్రజలకు పెద్ద ఉపశమనమని ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్(ఏఐఐఈఏ) ప్రధాన కార్యదర్శి వరప్రసాద్ అన్నారు. జీఎస్టీ కౌన్సిల్ 56వ సమావేశంలో తీసుకున్న నిర్ణయం సోమవారం నుంచి అమల్లోకి వచ్చిన సందర్భంగా ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా భీమా ఉద్యోగుల సంఘం చేసిన నిరంతర పోరాటం, ప్రజాభిప్రాయ సమీకరణ ఫలితంగా కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య, జీవిత భీమా ప్రీమియంలపై అమల్లో ఉన్న 18 శాతం జీఎస్టీని ఉపసంహరించుకుందన్నారు. ఈ విజయం సాధించడానికి ఏఐఐఈఏ 2004 నుంచి నిరంతరం పోరాటం చేస్తూ వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో ఐసీఈయూ అధ్యక్షురాలు ఎం.కామేశ్వరి, ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, ఐసీఈయూ, బీపీఎస్ఈ యూనిట్ నాయకత్వంలో ఉద్యోగులు పాల్గొన్నారు.